సాక్షి ప్రకాశం

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



ముంచేసిన వర్షం!

పశ్చిమ ప్రకాశంలో గురువారం ఉదయం మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. పంట చేలను ముంచేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- 8లో..

ఆకట్టుకున్న పాలిటెక్ ఫెస్ట్



ఒంగోలులోని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రీజినల్ పాలిటెక్ ఫెస్ట్-2024 ప్రారంభమైంది. జిల్లాలోని 17 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 30/24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జూపూడి



ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఆయన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సామాజిక న్యాయ సలహాదారుడిగా పనిచేశారు.

నేడు కలెక్టరేట్ వద్ద వలంటీర్ల నిరసన

ఒంగోలు అర్బన్: కూటమి ప్రభుత్వంలో వలంటీర్లకు జరిగిన అన్యాయంపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వలంటీర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే హుమయూన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా స్థానిక అద్దంకి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని వలంటీర్లంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు

ఒంగోలు అర్బన్: పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పేరెంట్స్, టీచర్స్ మధ్య సానుకూల సంబంధాలు పెంచేలా ఈ నెల 7వ తేదీ మెగా పేరెంట్, టీచర్ సమావేశాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక ప్రకాశం భవనంలో గురువారం మీడియాతో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 2,407 పాఠశాలల్లో పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పశ్చిమంపై ఫెంగల్ దెబ్బ..!

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలో అధిక విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లింది. శనగ పంట పూర్తిగా పాడైపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గురువారం కూడా గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురిసి పలు రకాల పంటలు నీట మునిగాయి. అధిక పెట్టుబడులు పెట్టి సాగుచేస్తున్న పంటలు అకాల వర్షాలకు దెబ్బతినడంతో రైతులు కన్నీరుపెట్టుకుంటున్నారు.

- భారీ వర్షాలకు పంటలపై తీవ్ర ప్రభావం
- 10,336 హెక్టార్లలో నష్టం
- 5,506 హెక్టార్లలో తుడిసిపెట్టుకుపోయిన శనగ
- మినుము, పొగాకు పంటలపైనా ప్రభావం

ఒంగోలు సబర్బన్:

జిల్లాలోని పశ్చిమ ప్రాంతాన్ని ఫెంగల్ తుఫాన్ కుదిపేసింది. వరుసపెట్టి కురుస్తున్న భారీ వర్షాలు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలతో పాటు రబీలో సాగుచేసిన పంటలపై కూడా తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలోని అధికారులు రూపొందించిన ప్రాథమిక పంట నష్టం అంచనాల ప్రకారం.. 10,336 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. పశ్చిమ ప్రకాశంలోని కనిగిరి, సీఎస్ పురం, వెలిగండ్ల, పామూరు, కొమరోలు, పీసీ పల్లి, కంభం, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల మండలాల్లో అత్యధికంగా పంట నష్టం వాటిల్లింది. ఫెంగల్ తుఫాన్ తీరందాటినప్పటికీ జిల్లాలో వర్షాలు మాత్రం ఆగలేదు. పశ్చిమ ప్రకాశంతో పాటు తూర్పు ప్రకాశంలో కూడా రెండు రోజులుగా అధికంగా కురుస్తున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ పంట నష్టం పెరుగుతుందని వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ, పొగాకు బోర్డు అధికారులు అంచనా



హనుమంతునిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో తరగతి గదిలోకి చేరిన వర్షం నీరు



కనిగిరి కొత్తూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువు వాగు

వేస్తున్నారు. ఫెంగల్ తుఫాన్ దెబ్బకు ప్రధానంగా శనగ పంటకు నష్టం వాటిల్లింది. మొక్క దశలో ఉండటంతో వర్షాలకు పొలాల్లో నీరు నిలబడి వేరుకుళ్లి పంటకు నష్టం వాటిల్లింది.

పంట నష్టం ఇలా...

ఇప్పటి వరకు వేసిన అంచనాల ప్రకారం జిల్లాలో శనగ పంట 5,506 హెక్టార్లలో దెబ్బతింది. 1,902 హెక్టార్లలో మినుము, 85 హెక్టార్లలో కంది, 1,333 హెక్టార్లలో పొగాకు, 676 హెక్టార్లలో వరి, 176 హెక్టార్లలో నువ్వు, 24 హెక్టార్లలో పెసర, 133 హెక్టార్లలో మొక్కజొన్న, 114 హెక్టార్లలో వరిగ, 48 హెక్టార్లలో సజ్జ, 56 హెక్టార్లలో జొన్న, 283 హెక్టార్లలో అలసంద పంటలు దెబ్బతిన్నాయి. మిర్చి, పూలతోటలు కూడా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు ఇంకా పంట నష్టం అంచనాలు రూపొందిస్తూనే ఉన్నారు.



రాచర్ల మండలం పలుగుంటిపల్లెలో మిరప పంటలో నిలిచిన వర్షం నీరు



భారీ వర్షానికి ఒంగోలు భాగ్యనగర్ రెండో లైన్ సమీపంలో నిలిచిన నీళ్లు

అంచనాలు రూపొందించడంలో పొగాకు బోర్డు అధికారులు విఫలం...

ఫెంగల్ తుఫాన్ తాకిడికి జిల్లాలో పొగాకు రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారు. అయితే, పొగాకు పంట నష్టంపై అంచనాలు రూపొందించడంలో పొగాకు బోర్డు అధికారులు తీవ్రంగా విఫలం చెందారు. పొగాకు పంటకు అసలు నష్టమే జరగలేదని బోర్డు అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు అంటున్నారు. ఒకవైపు తుఫాన్ తాకిడికి పొగాకు పంటకు నష్టం సంభవిస్తే.. జిల్లాలోని బోర్డు అధికారులు మాత్రం పొగాకు పంటకు నష్టం లేదని బోర్డు ఉన్నతాధికారులకు చెప్పడం చూస్తుంటే రైతులను నిలువునా మోసం చేసినట్లే ఉంది. ఫెంగల్ తుఫాన్‌కు జిల్లాలో 1,333 హెక్టార్లలో పొగాకు పంటకు నష్టం వాటిల్లినట్లు జిల్లాలోని వ్యవసాయ శాఖాధికారులు అంచనాలు రూపొందించారు. అక్టోబర్‌లో కురిసిన అధిక వర్షాలకు కూడా పొగాకు పంటకు నష్టం వాటిల్లింది.

అక్టోబర్‌లోనూ 10 వేల హెక్టార్లలో పంట నష్టం...

ఈ ఏడాది అక్టోబర్‌లో కురిసిన అధిక వర్షాలకు కూడా జిల్లా వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. అక్టోబర్ 13 నుంచి 21వ తేదీ వరకు ముసురుపట్టి మరీ భారీ వర్షాలు కురిశాయి. దాంతో అప్పట్లో దాదాపు 10 వేల హెక్టార్ల వరకు పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు కూడా అలాగే జరుగుతోంది. వరుస వర్షాలు, పంట నష్టాలతో జిల్లాలోని రైతులు అతలాకుతలమవుతున్నారు.

ఒంగోలులో భారీ వర్షం...

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోనూ గురువారం వేకువజాము నుంచి ఉదయం 7.30 గంటల వరకూ భారీ వర్షం కురిసింది. కాసేపు ఆగి మళ్లీ గంట పాటు కుమ్మేసింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో మరోసారి భారీ వర్షం కురవడంతో నగరం జలమయమైంది.

ఉసురు తీసిన ఉపాధి





పొదిలి ప్రభుత్వ వైద్యశాల వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

- పొలం పనులకు వచ్చి విద్యుత్ షాక్‌తో మృతిచెందిన యువకులు
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు

కొనకనమిట్ల: ఉపాధి కోసం ఊరుగాని ఊరొచ్చారు. పొలం పనులు చేస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందారు. అయినవాళ్లకు తీరని శోకాన్ని మిగిల్చారు. ఇక తమ కుటుంబాలకు దిక్కెవరంటూ మృతుల కుటుంబ సభ్యులు భోరున విలపించారు. కొనకనమిట్ల మండలం సిద్దవరం, చినారికట్ల సమీపంలోని నిమ్మతోటల్లో కూలి పనులకు వచ్చిన పెద్దారవీడు వ్యవసాయ కూలీల్లో గురువారం ఇద్దరు మృతిచెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం అలముకుంది. రైతు చెన్నారెడ్డికి చెందిన నిమ్మతోటల్లో కూలి పనులు చేస్తుండగా, పెద్దారవీడుకు చెందిన యువకులు సంకుల రంగారావు (30), ఒంటేరు నాగరాజు (31) విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందారు. నిమ్మతోటల్లో విద్యుత్ తీగలు లాగుతుండగా, కింద ఉన్న తీగలకు విద్యుత్ సరఫరా జరిగింది. ఆ తీగలను తొక్కిన ఇద్దరు యువకులు విద్యుత్ షాక్‌కు గురవగా, తోటి కూలీలు గమనించి పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్ పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. వారితో పాటు పనులు చేస్తున్న మరో ముగ్గురు త్రుటిలో ప్రాణపాయం నుంచి తప్పించుకున్నారు. సమాచారం తెలుసుకుని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుల్లో రంగారావుకు భార్య రంగలక్ష్మమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా, నాగరాజుకు భార్య తిరుపతమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొనకనమిట్ల ఎస్‌ఐ టి.రాజ్‌కుమార్ పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్వగ్రామంలో విషాదం...

మృతుల స్వగ్రామమైన యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు మండల కేంద్రంలో విషాదం అలముకుంది. నిత్యం గ్రామంలో కనిపించే యువకులు వేరే గ్రామంలో పొట్టకూటి కోసం కూలి పనికి వెళ్లి ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ పనులు చేయడంలో రంగారావు, నాగరాజు చురుగ్గా ఉండేవారు. ఎక్కడికైనా వెళ్లి పనులు చేసి వస్తుంటారు. కానీ, విధి వారిని విగతజీవులుగా మార్చిందని పలువురు గ్రామస్తులు ఆవేదన చెందారు.

వ్యవసాయం చేస్తూనే కూలి పనులకు...

పెద్దారవీడు: మృతుల్లో సంకుల రంగారావుకు ఎకరా పొలం ఉంది. అందులో పత్తి పంట సాగు చేశాడు. అంతంత మాత్రంగానే దిగుబడి వచ్చింది. ఖాళీ సమయంలో కూలి పనులకు వెళ్తుంటాడు. భార్య రంగలక్ష్మమ్మ కూడా ప్రతి రోజూ వ్యవసాయ కూలి పనులకు వెళ్తుంటుంది. ఇద్దరికి వచ్చే డబ్బుతో కుటుంబ పోషణ సాగిస్తుంటారు. కుమార్తె లేఖశ్రీకి 5 ఏళ్ల వయసు కాగా, మార్కాపురం పట్టణంలోని అరవింద్ స్కూల్లో ఎల్‌కేజీ చదువుతోంది. కుమారుడు రంజిత్‌కి మూడేళ్లు. ఇంటి దగ్గరే ఉంటాడు. ఒంటేరు నాగరాజు, భార్య తిరుపతమ్మ వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. వీరి కుమార్తె అశ్వినికి ఐదేళ్లు కాగా, స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతోంది. పనులకు వెళ్తున్నామని భార్యలకు చెప్పి ఉదయం ఇంటి వద్ద నుంచి బయటకు వచ్చిన వారు మధ్యాహ్నానికి మృత్యువాత పడటంతో వారి భార్యలు సొమ్మసిల్లిపడిపోయారు. ఇక మాకు దిక్కెవరంటూ వారు విలపించిన తీరు చూపరులతో సైతం కన్నీరు పెట్టించింది.

అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాం : మస్తాన్, నాగుల్‌మీరా, కాశీంవలి

మేము మొత్తం ఐదుగురిమి నిమ్మతోటల్లో పనిచేసేందుకు పెద్దారవీడు గ్రామం నుంచి కొనకనమిట్ల మండలం వచ్చాం. తోటలో పనిచేస్తుండగా డ్రిప్ వైరుకు పక్కనే విద్యుత్ వైర్లు ఉన్నాయి. వాటిని తొక్కడంతో నాగరాజు, రంగారావు షాక్‌కు గురై మృతి చెందారు. వారి పక్కనే ఉన్న మేము విద్యుత్ షాక్‌కు గురవకుండా అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాం. కానీ, మా స్నేహితులు మృతి చెందడం చాలా బాధగా ఉంది.



ప్రాణాలతో బయటపడిన కాశీంవలి, మస్తాన్, నాగుల్‌మీరా

పుష్ప-2 హౌస్‌ఫుల్..!



ఒంగోలులో సత్యం థియేటర్ వద్ద ఉన్న అభిమానులు

ఒంగోలు టౌన్: జిల్లాలో ఎక్కడ చూసినా పుష్ప-2 గురించే చర్చ జరుగుతోంది. ఏ ఇద్దరు కలిసి మాట్లాడుకుంటున్నా ఆ సినిమా గురించే వినిపిస్తోంది. సినిమా అదిరిందంటగా అంటూ సినీ హీరో అల్లు అర్జున్ అభిమానులు సంతోషంగా చెప్పుకుంటున్నారు. గురువారం రిలీజ్ రోజే సినిమా చూసేందుకు థియేటర్లకు ఫ్యాన్స్ పోటెత్తారు. జిల్లాలోని థియేటర్లన్నింటిలో పుష్ప-2 సినిమానే ప్రదర్శించగా, హౌస్‌ఫుల్ అయ్యాయి. సినిమాలోని పంచ్ డైలాగులు, పాటలు, ఫైట్లకు అభిమానులు విజిల్స్ వేసి సందడి చేశారు. జాతర సీనును అద్భుతంగా చిత్రీకరించారంటూ చెబుతున్నారు. బుధవారం రాత్రి ప్రీమియర్ షో చూసేందుకు అల్లు అర్జున్ అభిమానులు ఎగబడ్డారు. రాత్రంతా సినిమా హాళ్ల వద్ద పడిగాపులు కాసారు. సినిమా సూపర్ హిట్ టాక్ రావడంతో అభిమానుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది. తగ్గేదేలేదంటూ హడావిడి చేశారు. టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బైకులతో విన్యాసాలు చేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో రవిప్రియమాల్, గోపి, కృష్ణ, గోరంట్ల, రత్నమహల్, సత్యం, సరోజ్‌మయూరీ థియేటర్లలో పుష్ప సినిమా ప్రదర్శించారు. గిద్దలూరులో కృష్ణ, శ్రీనివాస, బేస్తవారిపేటలో కళ్యాణి, దర్శిలో శివశంకర్ థియేటర్లలో బుధవారం రాత్రి 9.30 నుంచి గురువారం పూర్తిగా మొత్తం 7 షోలు ప్రదర్శించారు. చీమకుర్తిలోని కేశ్రీకేలోని మూడు సినిమాహాళ్లలో పుష్ప-2 ప్రదర్శించగా, అభిమానులు పండుగ చేసుకున్నారు. ఒకేరోజు 5 షోలు ప్రదర్శించారు. యర్రగొండపాలెంలోని లక్ష్మీవెంకటేశ్వర థియేటర్‌లో పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా అల్లు అర్జున్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. తొలిరోజు 4 షోలు ప్రదర్శించగా, అన్నీ హౌస్‌ఫుల్ అయ్యాయి. మార్కాపురంలో శ్రీనివాస, జగదీశ్వరి థియేటర్లలో పుష్ప-2ను తగ్గేదేలే అంటూ ప్రదర్శించగా, అన్ని షోలూ కిక్కిరిసాయి. ప్రేక్షకులతో సినిమా హాళ్లు కిటకిటలాడాయి.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

- డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు
- మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమీక్షిస్తున్న మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: గ్రీవెన్స్‌లో భూ సమస్యలపై ఎక్కువ వినతులు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. డిసెంబర్ 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ సందర్భంగా గురువారం స్థానిక ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఎమ్మెల్యేలు తాటిపర్తి చంద్రశేఖర్, ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డితో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చుక్కల భూములు, 22ఏ జాబితాలోని భూములపై రెవెన్యూ సదస్సుల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలిపారు. అక్రమ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. భూ దురాక్రమణ నిరోధక చట్టాన్ని కూడా ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 826 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించేందుకు తహసీల్దారు ఆధ్వర్యంలో ఒక బృందం, డిప్యూటీ తహసీల్దారు ఆధ్వర్యంలో మరో బృందం చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సుల్లో అర్జీలు అందజేసిన ప్రజలకు అప్పటికప్పుడే రసీదు ఇవ్వడంతో పాటు అదేరోజు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అసైన్డ్ భూములు వాస్తవ లబ్ధిదారుల ఆధీనంలో ఉన్నాయో.. లేదో పరిశీలించి అర్హులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న, మేయర్ సుజాత, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు స్వరూప్, రాజశేఖర్, రసూల్, సుదర్శనరావు, వెంకటస్వామి, రైతు సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సాధించేదేమీ లేదు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే దళితులు, పేదల భూములకు రిజిస్ట్రేషన్లు చేసి హక్కులు కల్పించాం
- పేదలకు రిజిస్ట్రేషన్ అయిన భూములపై స్పష్టత ఇవ్వకుండా సదస్సులతో కూటమి ప్రభుత్వం కుట్రలు
- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ఒంగోలు అర్బన్: ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సులతో సాధించేదేమీ లేదని, ఆ సదస్సుల్లో కుట్రకోణం దాగి ఉందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. రెవెన్యూ సదస్సులపై స్థానిక ప్రకాశం భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సమావేశం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళితులు, పేదల భూములకు సంబంధించి 20 ఏళ్లు దాటిన భూములన్నింటికీ సర్వే నిర్వహించి శాశ్వత హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఏం చేస్తుందని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ అయిన దళితులు, పేదల భూములకు ఎటువంటి స్పష్టత ఇవ్వకుండా సదస్సుల పేరుతో వారికి అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. ఒక ప్రభుత్వం సర్వే చేసి హద్దు రాళ్లు వేసి పేదల భూములకు హక్కు కల్పిస్తే.. వాటిని మళ్లీ రీ సర్వే చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం వేసిన హద్దు రాళ్లను తొందరపడి ఎవరూ తొలగించి ఆక్రమించరని అన్నారు. గత ప్రభుత్వం పేదల భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు పాల్పడిందంటూ కూటమి నేతలు అనడం సరికాదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విధానాలు మారుస్తూపోతే దళితులు, పేదలు న్యాయం కోసం ఎక్కడికిపోవాలని మండిపడ్డారు. అధికారులను అడ్డం పెట్టుకుని కూటమి నేతలకు అనుకూలంగా మార్చుకుని పేదలకు అన్యాయం చేసేందుకే ఈ సదస్సులు నిర్వహిస్తున్నారని, అలాంటి వాటిని సహించేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ అయిన దళిత, పేదల భూములకు జియో ట్యాగింగ్ చేసి సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలం మానేపల్లి పంచాయతీలో శతాబ్దాల నుంచి ఎడ్ల బీడుగా, అటవీ ప్రాంతంగా ఉన్న 152 సర్వే నంబర్‌లోని 180 ఎకరాల పైచిలుకు కొండ, ఎడ్ల బీడు భూమిని కూటమి నాయకులు నకిలీ పత్రాలతో కాజేసేందుకు పెద్ద పెద్ద జేసీబీలతో తొలచివేస్తుంటే.. ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోకపోవడంపై ఎమ్మెల్యే తాటిపర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. యర్రగొండపాలెం మండలం మొగుళ్లపల్లి పంచాయతీలో వైఎస్సార్ సీపీకి చెందిన ముసలయ్య 20 ఏళ్లకుపైగా సాగులో ఉండి పట్టాదారు పాస్‌పుస్తకం కలిగి ఉన్నాడన్నారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా అతని భూమి పక్కాగా ఉందన్నారు. అలాంటి భూమిని టీడీపీ నేతలు దౌర్జన్యంగా సాగుచేస్తుంటే ఎలాంటి చర్యలూ ఏవని ప్రశ్నించారు. ఇటువంటి అనేక భూ దందాలు కూటమి నేతలే చేస్తుంటే.. అధికారులు స్పందించకుండా అక్రమార్కులకు అండగా నిలుస్తుండటం దారుణమన్నారు. అక్రమాలకు అండగా నిలుస్తున్న అధికారులతో కమిటీలు వేసి ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తే సదస్సులు నిర్వహించడం వలన ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని ఎమ్మెల్యే తాటిపర్తి అన్నారు.



యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ఎంపీడీఓలు మెమోలు జారీ చేయకుండా చూడాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వీఆర్‌ఓలు



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఓల సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్: వీఆర్‌ఓలకు మెమోలు ఇచ్చే అధికారం ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీలకు లేకపోయినా వారు మెమోలు జారీ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని వీఆర్‌ఓల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వైపీ రంగయ్య, ఏసీ ఆదిరెడ్డి, ఇతర నాయకులు గురువారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఫిర్యాదు చేశారు. పామూరు పంచాయతీ సెక్రటరీ అక్కడ పనిచేస్తున్న వీఆర్‌ఓకు మెమో ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ స్పందించి జెడ్పీ సీఈఓ, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓలు వీఆర్‌ఓలకు మెమోలు ఇచ్చే అధికారం లేదని, తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు వీఆర్‌ఓల సంఘ నాయకులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ ట్రెజరర్ జానయ్య, వెంకటరామయ్య, సురేష్, అబ్దుల్ రహమాన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

103 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం బస్తాలను సివిల్ సప్లయ్ గోడౌన్‌లో దించుతున్న దృశ్యం

సింగరాయకొండ: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని గురువారం తెల్లవారు జామున సింగరాయకొండలోని ప్రశాంతి థియేటర్ సమీపంలో ప్రత్యేక బృందం సీజ్ చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివరామకృష్ణ కథనం ప్రకారం.. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో వెంటాడి పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. మధ్యాహ్నం తర్వాత లారీని తూకం వేయించి స్థానిక సివిల్ సప్లయ్ గోడౌన్‌లో భద్రపరిచామన్నారు. లారీలో 103 బస్తాలు మాత్రమే ఉన్నాయన్నారు. లారీ డ్రైవర్ అంజిరెడ్డిపై 6ఏ కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు పొదిలి ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ తెలిపారు. లారీలో కేవలం 103 బస్తాలే ఉన్నాయని అధికారులు చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

‘తిట్ల దండకం’ అంకానికి తెర!

- టీడీపీ నాయకులు, పోలీసుల చర్చలతో కేసు ఉపసంహరణ



తహసీల్దార్ కార్యాలయంలో రాజీ చర్చలు జరుపుతున్న నాయకులు, పోలీసులు

కురిచేడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందిని దూషించిన టీడీపీ నాయకుడు హసన్‌మియా, తహసీల్దార్ జి.రజనికుమారి మధ్య గురువారం సమోధ్య కుదిర్చారు. బుధవారం తహసీల్దార్ రజనికుమారిని హసన్ మియా క్షమాపణ కోరాడు. దాన్ని తిరస్కరించిన తహసీల్దార్ గురువారం మళ్లీ క్షమాపణ చెప్పగానే కేసు ఉపసంహరించుకున్నారు. గురువారం త్రిపురాంతకం సీఐ జి.హసన్, ఎస్సై శివ, టీడీపీ నాయకులు కలిసి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం హసన్‌మియాతో క్షమాపణ చెప్పించి కేసు ఉపసంహరణ చేసుకోవాలని తహసీల్దార్‌కు నచ్చజెప్పారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను దూషించిన కేసులో చొరవ తీసుకుని సర్దిచెప్పి రాజీ చేసిన పోలీసులు మిగతా వారి విషయంలో ఇలాంటి ప్రయత్నాలు ఎందుకు చేయడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మద్యం దుకాణాల్లో నిబంధనలు పాటించాలి



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

ఒంగోలు టౌన్: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మద్యం దుకాణాలు నిర్వహించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్ఫోర్స్‌మెంట్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవనంలో ప్రకాశం, బాపట్ల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులతో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘించకుండా చూడాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడా నాటుసారా కాయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, అక్రమ మద్యం విక్రయాలను కట్టడి చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల డిప్యూటీ కమిషనర్ కె. హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ప్రకాశం జిల్లా డీపీఈఓ షేక్ ఖాజా మోహిద్దీన్, బాపట్ల డీపీఈఓ జి.దేవదత్తు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్‌గా బైసాని రామకృష్ణ



బైసాని రామకృష్ణ

కంభం: మండలంలోని ఎల్.కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న బైసాని రామకృష్ణ ఏపీఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జీఓ జారీ చేసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగంలో బైసాని రామకృష్ణను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు రామకృష్ణను అభినందించారు.



సీఎస్‌పురం : చెన్నపునాయునిపల్లెలో దెబ్బతిన్న వరి



గిద్దలూరు : అంబవరంలో నీట మునిగిన మిరప తోట



రాచర్ల : అనుములవీడులో దెబ్బతిన్న పప్పు శనగను చూపిస్తున్న రైతు

ముంచేసిన వర్షం!

- పశ్చిమ ప్రకాశంపై వాయుగుండం ప్రభావం
- గురువారం ఉదయం మూడు గంటల పాటు జోరు వాన
- కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో 25 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

సాక్షి నెట్‌వర్క్:

ఫెంగల్ తుఫాన్ తీరం దాటి వాయుగుండంగా మారడంతో గత రెండు రోజులుగా గిద్దలూరు, కనిగిరి, కొండపి, ఒంగోలు తదితర నియోజకవర్గాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. లేత మొక్కజొన్న, పప్పుశనగ పొలాల్లో భారీగా నీరు చేరింది. రెండు రోజులుగా పంట నీటిలో నానుతుండటంతో రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిరప తోటలకు ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టామని, చేలు నీటమునగడంతో మొక్కలు చనిపోయే స్థితికి వచ్చాయని రైతులు తీవ్రంగా కలత చెందుతున్నారు. బేస్తవారిపేట మండలంలో పంటలపై వర్షం తీవ్ర ప్రభావం చూపింది. గిద్దలూరు మండలంలో వరి, పప్పుశనగ, మొక్కజొన్న, కంది, మిర్చి,జొన్న, పొగాకు పంటలు సుమారు 2 వేల హెక్టార్లలో నీట మునిగాయి. రాచర్ల మండలంలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి వరద నీరంతా పంట పొలాలను ముంచెత్తింది. అత్యధికంగా పప్పుశనగ, మిర్చి, టమోటా, నువ్వులు, పత్తి పొలాల్లో భారీగా వర్షం నీరు నిల్వ చేరాయి. మిర్చి, పప్పుశనగ, టమోటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం సంభవించనట్లు అంచనా. కొమరోలు మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పప్పుశనగ, పొగాకు, నువ్వులు, మినుము, వరి పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.



బేస్తవారిపేట : మోక్షగుండంలో నేలకొరిగిన వరిపంట

కనిగిరిలో కురిసిన భారీ వర్షానికి పట్టణ రోడ్లపై మోకాళ్ల లోతు నీరు ప్రవహించాయి. ప్రభుత్వ కార్యాలయాలు నీటి కుంటలను తలపించాయి. కొత్తూరు వద్ద వాగు పొంగడంతో కొంతసేపు రాకపోకలు నిలిచాయి. చాకిరాల, అగ్రహారం,మాచవరం, పొనుగోడు, చల్లగిరిగల, ఎడవల్లి, నందరమారెళ్ల బడుగులేరు, తుమ్మకుంటలో శనగ, మిరప, కంది, పొగాకు తోటలు నీట మునిగాయి. ఎస్.గొల్లపల్లి వద్ద చెరువు కాలువ కట్ట తెగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. హనుమంతునిపాడు మండలంలో ఎర్రవాగు, కొండవాగు, దోమలేరు పొంగి ప్రవహిస్తున్నాయి. హనుమంతునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి భారీగా నీరు చేరింది. వరి, మిరప, కంది, పొగ తోటలు ఉరకెత్తే ప్రమాదం ఉందని రైతులు మదనపడుతున్నారు. సీఎస్ పురం మండలంలో మినుము 400 హెక్టార్లు, వరి 25 ఎకరాల్లో, శనగ 45 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. పామూరు మండలంలో శనగ 757 హెక్టార్లు వరి 21 హెక్టార్లు, మినుము 678 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ఏఓ కంచం రాధ తెలిపారు.



హనుమంతునిపాడు : దాసళ్లపల్లి వద్ద నీట మునిగిన కంది



కొమరోలు : బాదినేనిపల్లె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పులివాగు

ఆకట్టుకున్న పాలిటెక్ ఫెస్ట్

- జిల్లా వ్యాప్తంగా 17 కళాశాలల విద్యార్థుల హాజరు
- ఫెస్ట్‌ను ప్రారంభించిన మంత్రి డీబీవీ స్వామి

ఒంగోలు సిటీ: మేధస్సుకు పదునుపెట్టి ఆహా అనిపించే ఆవిష్కరణలు చేస్తున్నారు పాలిటెక్నిక్ విద్యార్థులు. ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకుంటూ వినూత్న ఆవిష్కరణలకు తెరతీశారు. ప్రజలకు ఉపయోగపడే పరికరాల నమూనాలతో ప్రతిభను చాటుకున్నారు. సమాజహితం కోరి వారు రూపొందించిన మేటి ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గురువారం ఒంగోలులోని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రీజనల్ పాలిటెక్ ఫెస్ట్–2024 ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో రీజియన్ ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ, ప్రిన్సిపాల్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ ఫెస్ట్‌లో జిల్లాలోని 17 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



రీజనల్ పాలిటెక్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డోలా, దామచర్ల సత్య

విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణల్లో కొన్ని..

ఇంటి రక్షణ కోసం స్మార్ట్ గ్యాస్ లీక్ అలారం



స్మార్ట్ గ్యాస్ లీక్ అలారం ప్రాజెక్టు..

గృహాల్లో ఎల్‌పీజీ గ్యాస్ లీకేజీలు ప్రమాదకరమైన పేలుళ్లకు దారి తీయవచ్చు. వీటిని ముందుగానే పసిగట్టేందుకు ‘నోడ్ ఎం.సీ.యు. మైక్రోకంట్రోలర్, ఎం.క్యూ–2 గ్యాస్ సెన్సార్’ దోహదపడుతుంది. వినియోగదారులకు నిజ–సమయ నోటిఫికేషన్ పంపుతుంది. దీనిని ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఎం.రవికుమార్, ఆర్.వి.హనుమాన్ రూపొందించారు.

తాగడానికి ఒక కాంపాక్ట్ డీశాలినేషన్ పరికరం



డీశాలినేషన్ ప్రాజెక్టుతో విద్యార్థులు

ప్రపంచ వ్యాప్తంగా తాగునీటి కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఉప్పు నీటిని సురక్షిత తాగునీటిగా మార్చేందుకు డీశాలినేషన్ పరికరం దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టును ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన కె.రవికుమార్, జి.రవి భవాని రూపొందించారు.

సోలార్ ట్రాకర్ సిస్టమ్



సోలార్ ట్రాకర్ సిస్టమ్ ప్రాజెక్టు..

ఈ ప్రాజెక్టును ఈతముక్కల పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థినులు జ్ఞానీ, నాగేశ్వరి రూపొందించారు. సింగిల్ -యాక్సిస్ సోలార్ ట్రాకర్లు సూర్యుడిని తూర్పు నుంచి పడమర వరకు ట్రాక్ చేస్తాయి. ఒకే బిందువుపై తిరుగుతూ, ప్యానెల్ వరుస ద్వారా లేదా విభాగం ద్వారా ఏకరీతిగా కదులుతాయి.

హ్యూమన్ ఫాలోయింగ్ రోబోట్



హ్యూమన్ ఫాలోయింగ్ రోబోట్ ప్రాజెక్టు..

ఈ ప్రాజెక్టును ఈతముక్కల పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థినులు వెంకటలక్ష్మి, నాగశ్రీ రూపొందించారు. హ్యూమన్ ఫాలోయింగ్ రోబోట్ దాని ముందు కదులుతున్న వస్తువును గుర్తిస్తుంది. ఇది ఐఆర్ సెన్సార్, అల్ట్రా సోనిక్ సెన్సార్ నుంచి జ్ఞానాన్ని పొందుతుంది. సర్వో మోటార్ 180 డిగ్రీల వద్ద తిరుగుతుంది.

ఒంగోలులో భారీ చోరీ

- రూ.15 లక్షల విలువైన బంగారు నగల అపహరణ



చిందరవందరగా బీరువాలో వస్తువులు

ఒంగోలు టౌన్: పెళ్లికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడి ఉన్నదంతా ఊడ్చేశారు. ఈ సంఘటన ఒంగోలు నగరంలోని అన్నవరప్పాడు మొదటిలైనులో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సూరేపల్లి వెలుగొండరావు బుధవారం పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో బంధువుల ఇంట్లో వివాహానికి కుటుంబంతో సహా హాజరయ్యారు. గురువారం ఉదయం తిరిగి వచ్చేసరికి తలుపులు ఆక్సా బ్లేడుతో కోసి ఉండటాన్ని గమనించారు. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. అందులో ఉన్న సుమారు రూ.15 లక్షల విలువైన 200 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. చోరీ జరిగిందని నిర్ధారించుకున్న ఆయన వెంటనే టూటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ మేడా శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పురుష ఆరోగ్య కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఒంగోలు టౌన్: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న పురుష ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలని ఆదేశాలు ఇవ్వడం దారుణమని, ఏళ్ల తరబడి పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.జగన్‌మోహన్‌రావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. 2001 నుంచి వివిధ ఉత్తర్వుల ద్వారా ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్న వీరంతా పర్మినెంట్ అవుతామన్న ఆశతో ఉన్నారన్నారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు పురుష ఆరోగ్య కార్యకర్తలను తొలగించడం బాధాకరమన్నారు. వీరి కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి సర్వీసును దృష్టిలో పెట్టుకుని ఉద్యోగాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ప్రాణం తీసిన వర్షం!

- రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి, తల్లి పరిస్థితి విషమం
- రైజ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న తల్లి జ్యోతి



సౌత్ బైపాస్ సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న స్కూటర్



ప్రమాదంలో మృతి చెందిన కుషాల్



గాయపడిన జ్యోతి

ఒంగోలు టౌన్: వర్షం ఓ యువకుడి ప్రాణాలు తీసింది.! మరొకరిని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టింది. గురువారం ఉదయం స్కూటీపై కాలేజీకి వెళ్తున్న తల్లీకుమారుడు ఒంగోలు సౌత్ బైపాస్ సమీపంలో ఆగిఉన్న ఇటుకల ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. పోలీసుల కథనం ప్రకారం... మద్దిపాడు మండలంలోని లింగంగుంటకు చెందిన పిల్లి జ్యోతి(42) ఒంగోలు రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆమె కుమారుడు కుషాల్(17) అదే కాలేజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి గురువారం ఉదయం స్కూటీ మీద కాలేజీకి బయలుదేరారు. మధ్యలో వర్షం మొదలైంది. ఈ క్రమంలో సౌత్ బైపాస్ వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన ఇటుకల ట్రాక్టర్‌ను వర్షంలో గమనించిక వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కుషాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. జ్యోతి తలకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను హుటాహుటిన సమీపంలోని కార్పొరేట్ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. తాలుకా ఎస్ఐ సందీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా ఈ ప్రమాదం లింగంగుంట్ల గ్రామంలో విషాదాన్ని నింపింది. ఎంతో భవిష్యత్తు ఉన్న కుషాల్ అర్ధంతరంగా దుర్మరణం పాలవడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. జ్యోతి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు, సహోద్యోగులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తలపై వాహనం టైర్ ఎక్కడంతో ముఖం గుర్తించలేనంతగా ఛిద్రమైంది. మద్దిపాడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కాగా మృతి చెందిన వ్యక్తి జేబులో పెన్ డ్రైవ్‌ను పోలీసులు పరిశీలించగా అందులో కొన్ని ఫొటోలు లభించాయి. ఒకటి యూరో కిడ్ స్కూల్‌కు చెందిన బాలిక ఫొటో కాగా మరొకటి క్రిస్టియన్ పద్ధతిలో జరిగిన వివాహం ఫొటో ఉన్నాయి. మృతుడు సుమారు 5 అడుగుల ఎత్తు, నలుపు రంగు ప్యాంటు, అదే రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. వయసు సుమారు 45 ఏళ్ల వరకు ఉండవచ్చని, మృతుడి ఆనవాళ్లు గుర్తిస్తే ఒంగోలు జీజీహెచ్‌లో నిర్ధారించుకోవాలని పోలీసులు సూచించారు.



మృతుని వద్ద పెన్ డ్రైవ్‌లో లభ్యమైన ఫొటో

జాతీయ స్థాయి హాకీ టోర్నీకి మైనంపాడు విద్యార్థులు



హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సంతనూతలపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగిన అండర్ 14 రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రకాశం జిల్లా బాలబాలికల జట్ల తరఫున ప్రాతినిధ్యం వహించిన మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎ.లోహిత, ఎం.నరేంద్ర ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం డీవీఎల్ నరసింహారావు తెలిపారు. వీరు ఈ నెల 9 నుంచి 13 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్లో పాల్గొంటారని పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ తెలియజేశారు. పీఎంసీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, పీడీ కె.వనజ, మైనంపాడు హాకీ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.